

# నవభూమి కరీంనగర్

అనుబంధం

27 సెప్టెంబర్,2024 శుక్రవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


## ఉండాలంటే.. మా మాట వినాల్సిందే!



2



## వరుస తనిఖీలు... వణుకుతున్న అధికారులు

3

# కట్టుదిట్టంగా లడ్డూ ప్రసాదం

**వేములవాడ, –నవభూమి:** ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రాలైన వేములవాడ, కొండగట్టు, ధర్మపురి దేవస్థానాల లడ్డూ, పులిహోర ప్రసాదాలను భక్తులు పరమ పవిత్రంగా భావించి కొనుగోలు చేస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో గతంలో లడ్డూ తయారీలో తప్పిదం జరిగిందని ఆరోపణలు రావడంతో రాష్ట్ర దేవాదాయశాఖ అప్రమత్తమైంది.. ప్రధాన ఆలయాల్లో దిట్టం ఉత్తర్వులను తూచా తప్పకుండా పాటించాలని కమిషనర్ ఆదేశాలిచ్చారు.. రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో విజయ తెలంగాణ డెయిరీ నెయ్యిని మాత్రమే వినియోగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. కొండగట్టులో ఏటా 50 వేల కిలోల నెయ్యి వినియోగం కొండగట్టులో లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్న దృశ్యం కొండగట్టు అంజన్న ఆలయానికి వచ్చే భక్తులు లడ్డూతోపాటు పులిహోర ప్రసాదం కొనుగోలు చేస్తుంటారు. శని, మంగళవారాల్లో దాదాపు 15 వేల లడ్డూలు, 5 క్వింటాళ్ల పులిహోర తయారు చేసి విక్రయిస్తుంటారు. 100 గ్రాముల లడ్డూ రూ.25కు, 200 గ్రాముల పులిహోర రూ.20లకు విక్రయిస్తుంటారు. ప్రతి సంవత్సరం దాదాపు 25 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయిస్తున్నా.. పులిహోర తయారీకి ఖర్చు తక్కువ కావడంతో 75 శాతం లాభం ఈ ప్రసాదం ద్వారానే సమకూరుతుందని అధికారులు చెప్పారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై వివాదం నేపథ్యంలో కొండగట్టు అంజన్న ఆలయానికి సరఫరా చేస్తున్న నెయ్యిని కూడా పరీక్షలు చేయిస్తామని ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. లడ్డూ తయారీకి ప్రతి నెలా 4 వేల కిలోల చొప్పున, ఏడాదికి 50 వేల కిలోల వరకు నెయ్యిని ఖరీదు చేస్తున్నట్లు చెప్పారు. రాజన్న ఆలయానికి రూ.20 కోట్ల ఆదాయం వేములవాడ లడ్డూ తయారీలో మహిళా కార్మికులు వేములవాడ రాజన్నను దర్శించుకున్న భక్తులు ప్రత్యేకంగా స్వామివారి ప్రసాదం లడ్డూలను మహా ప్రసాదంగా భావించి కొనుగోలు చేసి తీసుకెళుంటారు. లడ్డూల తయారీని ఒక ఏఈవో, పర్యవేక్షకుడు, సిబ్బంది తనిఖీ చేస్తారు. భక్తుల రద్దీ అంచనాతో లడ్డూలను తయారు చేస్తుంటారు. దాదాపు ప్రతి నెల 10 నుంచి 15 వేల కిలోల నెయ్యిని లడ్డూల తయారీకి వినియోగిస్తుంటారు. ఆలయానికి ఏడాదికి రూ.20 కోట్ల ఆదాయం లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా సమకూరుతోంది. కిలో లడ్డూ తయారీకి 650 గ్రాముల నెయ్యి వినియోగించాల్సి ఉంటుంది. ఆలయానికి సరఫరా అయ్యే నెయ్యికి ఆరు నెలల కాలపరిమితి మాత్రమే ఉంటుంది. అందుకు అనుగుణంగానే నాణ్యమైన నెయ్యిని లడ్డూల తయారీలో వినియోగిస్తున్నామని ఏఈవో శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల అనిశా అధికారుల తనిఖీ సమయంలో





తూనికలు, నాణ్యత ప్రమాణాల అధికారులు నెయ్యి నమూనా కూడా తీసుకెళ్లారని చెప్పారు. ధర్మపురిలో రోజుకు 2 వేల విక్రయం ధర్మపురి దేవస్థానం లడ్డూ ప్రసాదం ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం లడ్డూ ప్రత్యేకంగా నిలుస్తోంది. 80 గ్రాముల లడ్డూ ప్రసాదానికి రూ.20, 200 గ్రాముల పులిహోర ప్రసాదానికి రూ.15 తీసుకుంటున్నారు. ప్రతిరోజు సరాసరి 2 వేలలు, శని, ఆదివారాలు 3 నుంచి 5 వేల వరకు లడ్డూ ప్రసాదాలు విక్రయిస్తారు. దిట్టం సామగ్రిని ఉప ప్రధాన అర్చకుడు, సంబంధిత స్టోర్ ఇన్‌ఛార్జి, ఈవో ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తున్నారు. 10 కిలోల లడ్డూ



ప్రసాదానికి 7 కిలోల నెయ్యి, 20 కిలోల చక్కెర, కాజు 700 గ్రాములు, కిస్‌మిస్‌లు 750 గ్రాములు, యాలకులు 100 గ్రాములు, కర్పూరం 10 గ్రాములు, జాజికాయ 10 గ్రాములు, మిస్రీ 500 గ్రాములు వినియోగిస్తున్నామని అధికారులు చెప్పారు. 2023 – 24 సంవత్సరానికి లడ్డూ ప్రసాదం ద్వారా రూ.1,50,20,00, పులిహోర ప్రసాదం ద్వారా రూ.54,69,750 ఆదాయం సమకూరింది. ఈవో సంకటాల శ్రీనివాస్ మాట్లాడుతూ ధర్మపురి దేవస్థానంలో లడ్డూ ప్రసాదాల విషయంలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నామని, ప్రస్తుతం కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## నారసింహుడి భక్తులకు తాగునీటి సమస్యలు



**ధర్మపురి-నవభూమి:** ఏటా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి భక్తులకు తాగునీటి సమస్యలు తీవ్రమవుతున్నాయి.ప్రతిరోజు తాగునీటి సమస్య ఉంటుండగా.. రద్దీ వేళల్లో అధికంగా ఉంటుంది. ప్రతిరోజు స్వామివారి దర్శనానికి 3 నుంచి 5 వేల మంది భక్తులు వస్తుంటారు. 1.50 లక్షల లీటర్ల నీరు అవసరం అవుతోంది. దివంగత మాజీ మంత్రి జే.రత్నాకర్‌రావు హయాంలో ప్రత్యేకంగా చొరవ తీసుకుని.. భక్తుల భాగస్వామ్యంతో శుద్ధజల నీటి పథకాన్ని ఆలయం పక్కన ఏర్పాటు చేయించారు. అయితే ఇది నిర్వాహణ లోపంతో మూలన పడింది. బోరు ఉన్న సరిగ్గా పనిచేయడం లేదు. దీంతో ప్రస్తుతం గోపురాల ముందు ఓపెన్ సంపును ఏర్పాటు చేశారు. పురపాలక ట్యాంకర్ల ద్వారా ఇందులో వ్యవసాయ బావులు, గోదావరి నీటిని నింపి ఆలయంలోకి నల్లా కనెక్షన్ ఇచ్చారు. ఈ నీటితోనే భక్తులు కాళ్లు, చేతులు కడగడంతో పాటు తాగటానికి ఉపయోగిస్తుండగా.. ఆలయ సిబ్బంది అయితే వంటపాత్రలు శుభ్రం చేస్తున్నారు. ఇలా అపరిశుభ్రమైనా నీటితో భక్తులకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.ప్రతిపాదనలకే పరిమితం తలాపునే గోదావరి ఉన్నా.. నరసింహుని భక్తులకు నదీ జలాలు అందడం లేదు. ఆలయంలో పూర్తిస్థాయిలో శుద్ధజలాలు అందించాలనే ఉద్దేశంతో గోదావరి నుంచి పైపులైను వేసి.. 4 మిలియన్ లీటర్ల ప్యూరిఫై ప్లాంటు కోసం 2018లో గతంలో అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలేకే పరిమితమైంది తప్ప పనులకు మాత్రం మోక్షం లభించ లేదు. శాశ్వతంగా ప్రత్యేక శుద్ధజల పథకాన్ని దేవస్థానంలో ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

## ముంచుకొస్తున్న గడువు.. పూర్తయ్యేనా పనులు?

**కరీంనగర్ -నవభూమి:** నగరంలో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల జిల్లా గ్రంథాలయ నూతన భవనం ఇది. రూ.7 కోట్లతో నిర్మితమవుతోంది. నిధులు సక్రమంగా అందితే ఈ పాటికే ఇది పూర్తవ్వాలి.ప్రస్తుతం శరవేగంగానే పనులు జరుగుతున్నా.. ఎప్పటికప్పుడు బిల్లులు అందితేనే మరో రెండు మూడు నెలల్లో పూర్తయ్యే వీలుంది. ఇదే కాకుండా నగరంలో పలురకాల పనులకు నిధుల గండం ఎదురవుతోంది. మరో 6 నెలల్లో అన్ని పనులు పూర్తవ్వాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటందాలి.రెండు వారాల కిందట దిల్లీలో జరిగిన స్మార్ట్‌సిటీ బోర్డు సమావేశంలో కరీంనగర్ నగరపాలక సంస్థ పనుల ప్రగతిపై చర్చ జరిగింది. కరీంనగర్ నగరపాలక సంస్థ నుంచి కమిషనర్ ఈ సమావేశానికి హాజరై ఇక్కడి పనుల ప్రగతిని వివరించారు. మూడు నెలల కిందట కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.30.62 కోట్లు విడుదలయ్యాయి. ఆ నిధులకు సంబంధించిన యూసీ (యుటిలైజేషన్ సర్టిఫికెట్)లు సమర్పిస్తే మిగతా నిధులను అందిస్తామని కేంద్రప్రభుత్వం తరపున అధికారులు విన్నవించారు.రూ.30.62 కోట్లు కేంద్రం వాటా విడుదలవగా.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వాటాగా రూ.30.62 కోట్లు రావాలి. మొత్తంగా రూ.61.24 కోట్లు తక్షణమే విడుదలైతే ప్రస్తుతం జరుగుతున్న పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులకు వీటిని వెచ్చించొచ్చు. ఈ మేరకు ఈ నిధులను విడుదల చేయాలని ఇటీవలే కొన్ని రోజుల కిందట నగరపాలిక కమిషనర్ సీడీఎంఏకు లేఖ రాశారు. స్మార్ట్ సిటీ గడువు వచ్చే ఏడాది మార్చి 31తో ముగుస్తుండటంతో మిగులు పనులకు నిధులు అత్యవసరమయ్యాయి. రూ.188కోట్లు అవసరం..!ఆకర్షణీయ నగరం గడువు ముంచుకొస్తున్న ప్రస్తుత తరుణంలో నిబంధనల ప్రకారం ఇంకా సుమారుగా రూ.188.11కోట్లు కరీంనగర్‌కు రావాల్సి ఉంది.



### ఉండాలంటే.. మా మాట

# వినాల్సిందే!

**జగిత్యాల -నవభూమి:** జగిత్యాల పురపాలిక జగిత్యాల పురపాలికలో పాలకవర్గ సభ్యుల ఒత్తిడి, పాలనా వ్యవహారాల్లో అడుగడుగునా అడ్డు తగులుతుండటంతో కమిషనర్లు రావడం..కొద్ది రోజులకే వెళ్లిపోవడం రివాజుగా మారింది.. ప్రస్తుత కమిషనర్ సమ్మయ్యతోనూ పాలకవర్గం అలానే వ్యవహరిస్తుండటంతో అంతర్గతంగా విభేదాలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది..పుర కమిషనర్‌గా పనిచేసిన అనిల్ భూ కుంభకోణంలో అరెస్టు కావడంతో ఆ పోస్టు ఖాళీగా ఉండిపోయింది. ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా జులై 3న సమ్మయ్య కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. విధుల్లో చేరడంతోనే ఆయన పలు విభాగాల్లో అక్రమాలను నిరోధించడంపై దృష్టి పెట్టారు. పుర పాలనలో ఆయన తీసుకున్న నిర్ణయాలను కొందరు కౌన్సిలర్లు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల పురపాలికలో కొందరు ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. ఇందులో ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు చేతివాటం చూపారు. మరోవైపు కొందరు సిబ్బందిని కార్యాలయంలో అంతర్గత బదిలీలు చేయాలని కమిషనర్‌పై తీవ్ర ఒత్తిడి పెరిగింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించనని ఆయన స్పష్టం చేయడంతో పాలకవర్గ సభ్యులు తట్టుకోవడం లేదని సమాచారం. విషయం ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విప్ లక్ష్మణ్‌కుమార్ దృష్టికి ఇరువర్గాలు తీసుకెళ్లగా ఎవరైనా నిబంధనల మేరకు పనిచేయాలని వారు సూచించినట్లు సమాచారం. అయినా కమిషనర్‌పై పాలకవర్గ సభ్యులు కొందరు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.అక్రమాలే కారణమా..? పురపాలక సంఘంలో తరచూ పలు విభాగాల్లో అక్రమాలు వెలుగు చూడటంతో కమిషనర్లు దీర్ఘకాలిక సెలవులో వెళ్లడం లేదా ఇతర ప్రాంతాలకు బదిలీలకు ప్రయత్నించడమో జరుగుతోంది.



గతంలో ఓ ఇంటి నిర్మాణ అనుమతి విషయమై పట్టణ ప్రణాళిక విభాగంలో అనిశా దాడి చేయడంతో ఓ టీపీఎస్, పొరుగు సేవల ఉద్యోగి పట్టుబడటం సంచలనం కలిగించింది. గతేడాది రెవెన్యూ విభాగంలో దొంగ రశీదులు సృష్టించినందుకు ఓ సీనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్ సస్పెండ్ కావడంతోపాటు అరెస్టయ్యారు. తాజాగా భూ కుంభకోణంలో కమిషనర్ అనిల్, ఆర్వో ప్రసాద్ సస్పెండ్ కావడంతోపాటు కటకటాల్లోకి వెళ్లారు. మరోవైపు ఇంధన వినియోగంలో అక్రమాలపై సీడీఎంఏ విచారణ కొనసాగుతోంది. పారిశుద్ధ్య నిర్వహణ, వాహనాల మరమ్మతుకు సంబంధించి కూడా విజిలెన్స్ విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. కొందరు అధికారులు సొంతంగా అక్రమాలకు అలవాటు పడగా.. మరికొందరు పాలకవర్గం ఒత్తిడి తట్టుకోలేక నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుని అక్రమాల్లో పాలుపంచుకున్నట్లు తెలుస్తోంది.అయిదేళ్లలో పలువురి బదిలీ..గడిచిన అయిదేళ్లలో పలువురు కమిషనర్లు విధుల్లోకి రావడం.. దీర్ఘకాల సెలవు పెట్టి బదిలీ చేయించుకోవడం సాధారణంగా మారింది. అక్రమాలకు సహకరిస్తే ఉద్యోగానికి ముప్పు ఉందనే భయంతో ఎం.రవిబాబు 2019 అక్టోబరు 16న సెలవులో వెళ్లారు. డీఈగా ఉన్న లచ్చిరెడ్డికి కమిషనర్‌గా 2020లో బాధ్యతలు ఇవ్వగా ఆయనపై ఆరోపణలు రావడంతో సెలవులో వెళ్లారు. జయంత్‌కుమార్ అనే కమిషనర్ సైతం 2020 జూన్ 18న సెలవులో వెళ్లారు. పలు కార్యక్రమాలతో ప్రజలతో మమేకమైన మారుతిప్రసాద్ 2021 జులై 21న సెలవు తీసుకోక తప్పలేదు. ఇంధన వినియోగంలో తన మార్కు చూపించిన స్వరూపరాణి ప్రజాప్రతినిధులకు సహకరించడంలేదనే విమర్శలతో ముప్పుతిప్పలు పెట్టడంతో 2022 సెప్టెంబరు 4న దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు.

# మిషన్ 1000

**కరీంనగర్ -నవభూమి:** వాహనదారుడికి సూపర్ హీరో కార్డు అందజేస్తున్న దృశ్యం రహదారి నిబంధనలపై సరైన అవగాహన లేకపోవడం ప్రమాదాలకు దారితీస్తోంది.ఇలాంటి పరిస్థితుల్లో 'ఇండియన్ యూత్ సెక్యూర్డ్ ఆర్గనైజేషన్, సాఫేర్ ఇండియన్ సంస్థ' ఆధ్వర్యంలో 'బీసేఫ్.. డ్రైవ్ సేఫ్.. రీచ్ సేఫ్..' నినాదంతో వెయ్యి రోజులపాటు రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించే కార్యక్రమానికి జనవరి 1, 2022న శ్రీకారం చుట్టగా ఈ నెల 26తో ఈ కార్యక్రమం ముగియనుంది.రోజూ కార్యక్రమాలు కరీంనగర్‌లో బస్టాండ్ చౌరస్తాలో వాహనదారులకు ప్రతిరోజు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు.నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపడం, సురక్షిత ప్రయాణానికి ఎలా డ్రైవింగ్ చేయాలి, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, లైసెన్స్ ప్రాముఖ్యం తదితర అంశాలను వివరించారు.హెల్మెట్, సీటుబెల్టు పెట్టుకున్న వారికి పూలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.సూపర్ హీరో పేరుతో ముద్రించిన కార్డు, బహుమతులు అందజేశారు.రహదారి నిబంధనలు, సిగ్నల్స్, వాటి ఉపయోగం, యూటర్న్, వేగం, హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోకుంటే జరిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.మైనర్లు వాహనాలు నడపడం వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు.ఆటో చోదకులకు యూనిఫాంలు కూడా అందజేశారు.విద్యార్థి స్థాయి నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు.ప్రధాన లక్ష్యాలు ఇవే..ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి.



# సరిగమప సీజన్-16 ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ గ్రాండ్ లాంచ్

- ఈ ఆదివారం సాయంత్రం 6 గంటలకు.
- అక్టోబర్ 6 నుండి ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు, మీ జీ తెలుగులో!

**ఖమ్మం, 26 సెప్టెంబరు (నవభూమి):** జీ తెలుగు ఆవిర్భావం నుంచి విలక్షణమైన ఫిక్షన్, నాన్ ఫిక్షన్ షోలు, సూపర్ హిట్ సినిమాలతో ప్రేక్షకులకు అంతులేని వినోదం అందించేందుకు నిరంతరం కృషి చేస్తోంది. వినోదాల పరంపరను కొనసాగిస్తూ జీ తెలుగు పాపులర్ షో సరిగమప సరికొత్త సీజన్తో వచ్చేస్తోంది. మట్టిలోని మాణిక్యాలను వెలికితీస్తూ అత్యంత ప్రేక్షకాదరణతో విజయవంతంగా 15 సీజన్లు పూర్తిచేసుకున్న జీ తెలుగు సరిగమప తన తదుపరి సీజన్ను ఘనంగా ప్రారంభిస్తోంది. సరిగమప సీజన్ -16 ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ సెప్టెంబర్ 29న, సాఎ 6:00 ప్రారంభం, అక్టోబర్ 6 నుండి ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు మీ జీ తెలుగులో మాత్రమే!

తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన గాయకులకు ప్రోత్సహించే లక్ష్యంతో డ్యాన్సింగ్, సింగింగ్ షోలతో మట్టిలో మాణిక్యాలను గుర్తిస్తోంది జీ తెలుగు. ఇందులో భాగంగానే విజయవంతంగా 15 సీజన్లు పూర్తి చేసుకున్న సింగింగ్ షో 'స రి గ మ ప' కొత్త సీజన్ ప్రారంభం కానుంది. ఈ సీజన్లో గాయనీ గాయకులు విలేజ్ వోకల్స్, సిటీ క్లాసిక్స్, మెట్రో మెలోడీస్ అనే మూడు జట్లుగా పోటీపడతారు. ఈ జట్లకు మెంటర్లుగా రేవంత్, రమ్య బెహరా, అనుదీప్ దేవ్ నాయకత్వం వహిస్తారు. ఈ సీజన్ కు ఎనర్జిటిక్ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుండగా, సంగీత దర్శకుడు కోటి, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, పాటల రచయిత కాసర్ల శ్యామ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు.




జీ తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్ - అనురాధ గూడూరు మాట్లాడుతూ, "యువ, అసాధారణ ప్రతిభావంతులకు ఎల్లప్పుడూ లాంచ్ ప్యాడ్ గా ఉన్న జీ తెలుగు సరిగమప సీజన్ 16 ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. ఈ సీజన్లో సింగింగ్ యూత్ ఐకాన్ కోసం పోటీ జరుగుతుంది. ప్రతి సీజన్ మాదిరిగానే ఈ సీజన్లోనూ ప్రతిభావంతులైన గాయనీ గాయకులను ప్రోత్సహించడమే మా లక్ష్యం. ఇప్పటికే మనం చూసిన ఎనర్జీ, ప్యాషన్, టాలెంట్ చెప్పుకోదగ్గవి. తమ కలలను నిజం చేసుకోవడమే కాకుండా లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చే ఓ వేదికను అందించడమే మా ఉద్దేశం. ఈ సీజన్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నాం' అంటూ ధీమా వ్యక్తం చేశారు.

## వరుస తనిఖీలు...

# వణుకుతున్న అధికారులు

**సిరిసిల్ల -నవభూమి:** వేములవాడ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో బోధిస్తూ...జిల్లాలో కలెక్టర్ సందీప్కుమార్ ఝా వరుసగా ఆకస్మిక తనిఖీలు చేస్తుండటంతో అధికారులు, ఉపాధ్యాయులు, వైద్యులు, ఇతర ఉద్యోగులు వణుకుతున్నారు.ప్రధానంగా విద్యా సంస్థలు, ఆసుపత్రులను సందర్శిస్తున్నారు. విద్యార్థులకు పాఠాలు బోధించి వారి నుంచి సమాధానాలు రాబడుతున్నారు. అదే సమయంలో వారికి కావాల్సిన సౌకర్యాలు, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకొంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్నారు. తద్వారా ఉద్యోగులు సమయపాలన పాటించడంతోపాటు పని తీరు మెరుగు పడిదేందుకు ఆస్కారం ఏర్పడింది.వేములవాడ మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయం ఆవరణ, తరగతి గదులు, మూత్రశాలలు, వంటగది తదితర వాటిని పరిశీలించారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పలు అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. గణితం, సామాన్యశాస్త్రం, ఆంగ్లంలో రాణించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలోని సదరం శిబిరాన్ని సందర్శించి ఆర్థో వైకల్య నిర్ధారణ పరీక్షలు చేస్తున్న తీరును పరిశీలించారు. ధ్రువపత్రాల జారీకి చర్యలు తీసుకొన్నారు.కోనరావుపేట మండలం మరిమడ్ల ఏకలవ్య ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులను సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే రెండు మూత్రశాలలు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ఎంపీడీవోను ఆదేశించారు.తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని గిరిజన సంక్షేమ విద్యాలయంలోని పీఈటీతో ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ బాలికలు ఆందోళన చేశారు. కలెక్టర్ అక్కడికి చేరుకుని వెంటనే పీఈటీ తొలగింపునకు ఆదేశాలు ఇచ్చారు. తరవాత ప్రిన్సిపల్ను సస్పెండు చేశారు.గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు చేస్తున్న పరీక్షల తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. డెంగీ నిర్ధారణ పరీక్షలపై ఆరా తీశారు. అనంతరం సిద్దిపేట,



కామారెడ్డి ప్రధాన రహదారిలోని లింగన్నపేట, గంభీరావుపేట మధ్యలో మానేరువాగుపై నిర్మిస్తున్న తాత్కాలిక రోడ్డు పనులపై ఆరా తీశారు.తంగళ్లపల్లి మండలం కేసీఆర్ కాలనీని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు.ఎల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత, అక్కపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ను పరిశీలించారు. కట్టెల పొయ్యిపై ఆహార పదార్థాలను తయారు చేయవద్దని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు.తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని గిరిజన సంక్షేమ విద్యాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సందీప్కుమార్ ప్రత్యేక అధికారుల నియామకం జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో మౌలిక వసతులపై తనిఖీ చేయడానికి 21 మంది జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నోడల్ అధికారిగా జిల్లా విద్యాధికారి రమేశ్కుమార్ను నియమించి నివేదికలు ఆయనకు ఎప్పటికప్పుడు పంపించాలని అందులో పేర్కొన్నారు. దీంతో వీరంతా వారికి కేటాయించిన వాటిని సందర్శిస్తున్నారు.



# అధిక సాంద్రతపై అన్నదాతల ఆశలు

**హుజూరాబాద్ -నవభూమి:** సైదాపూర్లో అధిక సాంద్రత పద్ధతిలో సాగుచేసిన పత్తి ప్రస్తుత సీజన్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుచేసిన రైతులు దిగుబడులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.గతేడాది వానాకాలం సీజన్లో ఇదే పద్ధతిలో ప్రయోగాత్మకంగా సాగు చేసినా ఆశించిన ఫలితం రాలేదు. దిగుబడులు ఎక్కువ వస్తాయని వ్యవసాయాధికారులు ప్రోత్సహించినా.. తీరా పంట చేతికొచ్చే సరికి నిరాశే ఎదురైంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి సాగులో మెలకువలు పాటించి దిగుబడులు పెరిగేలా.. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలు రైతులకు భరోసా కల్పిస్తున్నారు.గతేడాది నామమాత్రంగానే..జిల్లాలో గతేడాది 195 ఎకరాల్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేశారు. ఈ విధానంలో సాగు చేయడం ద్వారా ఎకరాకు 12-14 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు ప్రోత్సహించడంతో రైతులు ముందుకొచ్చారు. తీరా పత్తి చేతికి వచ్చేసరికి ఎకరాకు అయిదు నుంచి ఏడు క్వింటాళ్లకు మించి దిగుబడులు రాలేదు. ఒక్క సైదాపూర్ మండలంలోనే 25 మంది రైతులు 36 ఎకరాలు సాగు చేయగా అందరికి 5-7 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. అయితే గతేడాది అధిక వర్షాలు, వాతావరణ అనుకూలించక పోవడంతో



ఆశించిన దిగుబడులు రాలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.